నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 11 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



వెంటనే డబ్బులు చెల్లించాలి

నేను వర్షాకాలంలో 2.30 ఎకరాల్లో వరి సాగు చేశాను. 34 క్వింటాళ్ల సన్న రకం ధాన్యాన్ని పండించాను. బోనస్ వస్తదంటే ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించాను. కానీ ఇప్పటి దాకా క్వింటాల్‌కు రూ.500 బోనస్ రాలేదు. బోనస్ వస్తదనే ఆశతోనే సన్నరకం ధాన్యం పండించాను. కానీ సర్కార్ బోనస్ డబ్బులు వేయలేదు. ఇప్పటికైనా మాకు బోనస్ డబ్బులు చెల్లించాలని కోరుతున్నాం.

-గొడిపెల్లి మల్లేశ్, గంగన్నపేట

బోనస్ డబ్బులేవీ?

రెండు నెలలు కావస్తున్నా సన్న వడ్లు అమ్మిన రైతులకు బోనస్ లేదు..

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే రూ.30.40 కోట్ల పైచిలుకు బకాయి
- కాంగ్రెస్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు



బోనస్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నరు..

బహిరంగ మార్కెట్‌లో సన్నరకం ధాన్యం ధర క్వింటాల్‌కు రూ.2750 ఉన్నప్పటికీ బోనస్ వస్తదంటే దగ్గర్లోని కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించినం. ఇప్పటి వరకు రూపాయి కూడా రాలేదు. మూడున్నర ఎకరాల్లో సన్నరకం ధాన్యాన్ని సాగు చేయగా 140 కింటాళ్ల వరి ధాన్యాన్ని షట్‌పల్లిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించగా బోనస్ డబ్బులు మాత్రం జమ కాలేదు. ఇప్పటి వరకూ డబ్బులు ఇవ్వకుండా రైతులను ప్రభుత్వం ఇబ్బంది పెడుతున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బోనస్ డబ్బులు చెల్లించాలి.

-కందుల వెంకటేశ్, కోటపల్లి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలా..

రైతులు విక్రయించిన సన్న ధాన్యం : **87,839 మెట్రిక్ టన్నులు**

చెల్లించాల్సిన బోనస్ **రూ.83.93 కోట్లు**

చెల్లించిన బోనస్ **రూ.53.53 కోట్లు**

బకాయిపడిన బోనస్ **రూ.30.4 కోట్లు**

రెండు నెలలైనా డబ్బులు రాలేదు

దహెగాం, ఫిబ్రవరి10 : బోనస్ వస్తది అంటే నేను 20 క్వింటాళ్ల వడ్లు సొసైటీ వాళ్లకు ఇచ్చిన. రెండు నెలలైనా సన్నవడ్ల బోనస్ డబ్బులు రాలేదు. అప్పుడే ప్రైవేట్ వ్యాపారులు క్వింటాల్‌కు రూ. 2800 ధర పెడుతామంటే వాళ్లకు ఇవ్వకుండా సొసైటీ వాళ్లకు అమ్మిన. బోనస్ డబ్బులను సొసైటీ వాళ్లను అడిగితే వస్తాయ్ అంటున్నారు కానీ నెలలు గడుస్తున్నా ఇప్పటివరకూ రాలేదు. ఇస్తరు అనే నమ్మకం కూడా లేదు. రైతులను ఇట్ల ఇబ్బంది పెట్టుడు సరికాదు.

-తుమ్మిడి వెంకటేశ్, దహెగాం

మంచిర్యాల, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధాన్యానికి మద్దతు ధర చెల్లిస్తాం. సన్న రకం వరి సాగుకు క్వింటాలు ధాన్యంపై రూ.500 బోనస్ ఇస్తాం.' అని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. తీరా అధికారంలోకి వచ్చాక అసలు బోనస్ ఇవ్వడం లేదు. గత సీజన్‌లో కేవలం సన్న రకం ధాన్యానికే బోనస్ ఇస్తామని, అది కూడా ప్రభుత్వం ప్రకటించిన జాబితాలోని వెరైటీలకే ఇస్తామంటూ ప్రకటించారు. మిషన్ పెట్టి మరీ ధాన్యం గింజ పొడువు, వెడల్పు కొలిచి మరీ బోనస్‌కు ఎంపిక చేశారు. ప్రభుత్వం చెప్పిన వెరైటీలకే బోనస్ అనడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వివిధ రకాల సన్న రకాలు సాగు చేసిన రైతుల్లో దాదాపు 30 శాతం నుంచి 40 శాతం మంది బోనస్‌కు దూరమయ్యారు. ఇక కొనుగోళ్లు ఆలస్యం అవడం, కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ఎదురుచూడాల్సి రావడంతో చాలా మంది రైతులు ప్రైవేటుకు విక్రయించారు. ఇక ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే బోనస్ వస్తదని ఆశపడి.. అనేక వ్యయ ప్రయాసలకోర్చి ధాన్యం విక్రయించిన రైతులకు కాంగ్రెస్ సర్కారు నిలువునా ముంచింది. ధాన్యం విక్రయించి రెండు నెలలు పూర్తయి, మరోవైపు యాసంగి సాగు పనులు సాగుతుంటే ఇప్పటి వరకు బోనస్ ఇవ్వలేదు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటులో విక్రయిస్తే ఎక్కువ ధర ఇస్తామని దళారులు చెప్పినా.. ప్రభుత్వానికి విక్రయిస్తే బోనస్ వస్తుందను కుంటే రెండూ లేకుండా పోయాయంటూ రైతులు వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో రూ.30.40 కోట్ల బకాయిలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 87,839 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. మంచిర్యాల జిల్లాలో సన్నధాన్యం విక్రయించిన రైతుల్లో 7,517 మంది రైతులకు బోనస్ పడగా, 6,796 మంది రైతులకు బోనస్ పడలేదు. ఆసిఫాబాద్ జిల్లాలో సన్నధాన్యం అమ్మిన రైతులు 1468 మంది ఉండగా.. వీరిలో 219 మందికి రూ.72 లక్షలు బోనస్ పడింది. ఇంకా 1,249 మందికి రూ.4.93 కోట్లు రావాల్సి ఉంది. నిర్మల్ జిల్లాలో 8,870 మంది రైతుల నుంచి సన్నరకం ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా 2,483 మంది రైతులకు రూ.4.80 కోట్ల బోనస్ బకాయిలు చెల్లించాలి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల పరిధిలో ఉట్నూర్, దంతంపెల్లి, బీర్సాయిపేట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు 500 మంది రైతులు సన్నరకం ధాన్యాన్ని విక్రయించారు. వీరిలో దాదాపు సగం మందికి బోనస్ పడలేదని తెలుస్తున్నది. అధికారులు ఈ విషయంపై క్లారిటీ ఇవ్వలేదు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.83.93 కోట్ల బోనస్ డబ్బులు పడాల్సి ఉండగా.. ఇప్పటి దాకా రూ.53.53 కోట్ల బోనస్ డబ్బులే పడ్డాయి. దాదాపు రూ.30.40 కోట్ల బోనస్ బకాయి పడింది.

బోనస్ ఇస్తమంటేనే వడ్లు ఇచ్చినం..

దహెగాం, ఫిబ్రవరి10: సన్నవడ్లకు బోనస్ ఇస్తమంటేనే సొసైటీ వాళ్లకు వడ్లు ఇచ్చినం. ఇప్పటికీ రెండు నెలలైనా బోనస్ డబ్బులు రాలేదు. ప్రైవేటోల్లు నెట్ క్యాష్ ఇచ్చి క్వింటాల్‌కు రూ.2800తో కొన్నారు. అయినా సర్కారు బోనస్ ఇస్తదంటే ఇచ్చినం. నమ్మి మోసపోయినట్లయింది మా పరిస్థితి. జై శ్రీరామ్ వడ్లు 52 క్వింటాళ్లు ఇచ్చినం. క్వింటాల్‌కు రూ 500 చొప్పున మొత్తం 26 వేల రూపాయలు బోనస్ డబ్బులు రావాల్సిన ఉన్నది. తొందరగా బోనస్ డబ్బులు ఇవ్వాలి లేదంటే రైతులందరం కలిసి ఆందోళన చేస్తాం.

-తాడూరి రజిత, పీపీరావు కాలనీ, దహేగాం

ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్‌కుమార్ దీపక్

వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలి

మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్

దండేపల్లి, ఫిబ్రవరి10: వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున పాఠ్యాంశాల సిలబస్‌ను పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్ ఆదేశించారు. దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్ ప్రాథమిక పాఠశాల, లింగాపూర్‌లోని మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో రుచికరమైన పోషకాహారాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. నెల్కివెంకటాపూర్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్నందున పాఠశాలను గ్రామంలో మరో చోట ఏర్పాటు చేసి ఇక్కడ బాలుర బీసీ వసతి గృహం ఏర్పాటుపై చర్చించారు. ఆయన వెంట తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, ఆయా గ్రామాల జీపీల కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 10: శాసన మండలి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శాసనమండలి ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గానికి ఈ నెల 27న పోలింగ్ జరగనున్నందున ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు అందిస్తున్న బోధన తీరుపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు 40 రోజుల సమయం మాత్రమే ఉన్నందున వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపి, ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తి రైతు పరేషాన్

- సీసీఐ కేంద్రాల్లో విక్రయించేందుకు తిప్పలు
- కొనుగోళ్లు వేగవంతం చేయని అధికారులు
- జిన్నింగ్ మిల్లుల వద్ద వాహనాలతో గంటల తరబడి పడిగాపులు

చెన్నూర్, ఫిబ్రవరి 10: ఆరుగాలం కష్టించి పత్తి పంట పండించడం ఒక ఎత్తయితే..చేతికందిన పంటను కాపాడి విక్రయించడం రైతన్నలకు మరో ఎత్తవుతున్నది. సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద గంటల తరబడి బారులు తీరుతూ, అధికారులు విధించే అనేక కొర్రీలతో పత్తి విక్రయించేందుకు కర్షకులు అష్ట కష్టాలు పడుతున్నారు. చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఐదు జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు చేపడుతున్నారు. కొన్ని రోజులుగా తరచూ కొనుగోళ్లను నిలిపివేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మళ్లీ ఐదారు రోజులకు కొనుగోళ్లు ప్రారంభించగా ఇండ్ల వద్ద పేరుకపోయిన పత్తిని వందల సంఖ్యలో వాహనాల్లో రైతులకు ఒక్కసారిగా మిల్లుల వద్దకు తీసుకువస్తున్నారు. వెంట వెంటనే కొనుగోలు చేయలేక సీసీఐ వారు టోకెన్ పద్ధతిని పెట్టారు. టోకెన్లున్న రైతుల పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. టోకెన్లు అందని రైతులంతా జిన్నింగ్ మిల్లుల వద్ద వాహనాలతో గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఒక్కోసారి రెండు రోజుల పాటు అక్కడే ఉండాల్సి రావడంతో కిరాయికి తెచ్చిన వాహనాలకు వెయిటింగ్ చార్జీల భారం రైతులపై పడుతున్నది. ప్రభుత్వం పత్తి క్వింటాళ్లకు రూ 7,521 మద్దతు ధర ప్రకటించగా, ప్రారంభం నుంచే రూ 100 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. పత్తిలో తేమ ఉందని, నాసి రకంగా ఉందని, రంగు మారిందంటూ ధర తగ్గించి కొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత భూములున్న రైతుల వద్ద నుంచి ఆన్‌లైన్‌లో ఉన్న డాటా ద్వారా కౌలు రైతుల నుంచి తాత్కాలిక రిజిస్ట్రేషన్ ద్వారా సీసీఐ కొనుగోలు చేస్తున్నది. ప్రస్తుతం కౌలు రైతుల తాత్కాలిక రిజిస్ట్రేషన్‌ను సీసీఐ నిలిపివేసింది. ఈ విషయం తెలియక రైతులు వాహనాల్లో జిన్నింగ్ మిల్లుల వద్దకు తీసుకువచ్చి ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు సీసీఐ వారు ఎప్పుడూ కొనుగోలు చేస్తారో ? ఎప్పుడు నిలిపివేస్తారో? కూడా రైతులకు తెలియక పరేషాన్ అవుతున్నారు. దీంతో డబ్బులు అత్యవసరమున్న రైతులు పత్తిని దళారులు, ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దళారులు తక్కువ ధర నిర్ణయించి కొనడంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులకు మేలు చేయాల్సింది పోయి ఇలా ఇబ్బంది పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా భేషరతుగా మద్దతు ధర చెల్లించి కొనాలని డిమాండ్ చేస్తున్నారు.

చెన్నూర్‌లో జిన్నింగ్ మిల్లు వద్ద బారులు తీరిన పత్తి వాహనాలు

పరేషాన్ చేస్తున్నరు..

ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని అమ్ముదామంటే సీసీఐ వారు పరేషాన్ చేస్తుండ్రు. నాకున్న రెండున్నర ఎకరాల్లో పత్తి సాగు చేయగా 20 క్వింటాళ్ల దాకా పత్తి పండింది. ఇన్ని రోజులు కొనుగోళ్లను నిలిపి వేసి, సోమవారం నుంచి కొనుగోలు చేస్తున్నారని తెలియడంతో పత్తి అమ్ముదామని జిన్నింగ్ మిల్లుకు వాహనంలో తీసుకువస్తే సీసీఐ వారు కొనడం లేదు. పండించిన పంటను అమ్ముకోవడానికే ఇబ్బంది పడితే రైతు బతికేది ఎట్ల. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ప్రకటించిన మద్దతు ధర చెల్లించి ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతుల వద్ద నుంచి కొనాలి.

-శెవ్వ మహేశ్, రాయిపేట, చెన్నూర్ మండలం

కౌలు రైతు పరిస్థితి ఎట్ల..?

రైతు వద్ద నుంచి ఆన్‌లైన్‌లో ఉన్న డాటా ప్రకారం సీసీఐ కొనుగోలు చేస్తుండగా, కౌలు రైతుల నుంచి తాత్కాలిక రిజిస్ట్రేషన్ ద్వారా సీసీఐ కొనుగోలు చేస్తున్నది. అయితే ప్రస్తుతం తాత్కాలిక రిజిస్ట్రేషన్‌ను సీసీఐ నిలిపి వేసింది. నేను 13 ఎకరాలు కౌలు తీసుకొని పత్తి సాగు చేసిన, నాకు వంద క్వింటాళ్ల వరకు పత్తి పండింది. నాకు తెలియక ఇక్కడికి పత్తి తెచ్చిన. తాత్కాలిక రిజిస్ట్రేషన్లను నిలిపి వేసామని, కౌలు రైతుల పత్తిని కొనుగోలు చేయడం లేదని సీసీఐ వారు చెప్పారు. వాహనంలో లోడ్ చేసుకొని వచ్చాను, సీసీఐ వారు కొనబోమని అంటుంటే నేను ఇప్పుడు ఎక్కడకు పోవాలే.. ఎక్కడ అమ్మాలే.

- సాయిని సత్యం, సుబ్బ రాంపల్లి, చెన్నూర్

ఈ ప్రభుత్వ ఏం చేస్తున్నది..?

నేను ఐదు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసిన, నాకు 70 క్వింటాళ్ల వరకు పత్తి పంట పండింది. సీసీఐ సోమవారం నుంచి కొనుగోలు చేస్తున్నదని తెలియడంతో నేను ఒక్క రోజు ముందే ఆదివారం వాహనంలో పత్తి లోడ్ చేసుకొని మిల్లు వద్దకు వచ్చి లైన్ల పెట్టిన. అయితే సీసీఐ వారు మాత్రం పత్తి కొనడం లేదు. రెండు నెలల నుంచి అమ్ముదామంటే ఎప్పుడూ ఇదే తిప్పలు అవుతుందని మిగతా రైతులు చెప్పితే ఇన్ని రోజులు ఆగిన. సీసీఐ వారు గిట్ల రైతులను తిప్పలు పెడుతుంటే ప్రభుత్వం ఏమి చేస్తున్నట్టు. పండించుడు కంటే అమ్ముడానికే ఎక్కువ కష్టం అవుతుంది.

-మాలెపల్లి మల్లయ్య, జాజులపేట, వేమనపల్లి మండలం

పెద్దపులి పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

మాదారం అడవుల్లోకి పెద్దపులి

అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారుల హెచ్చరిక



గొంతెమ్మ గుట్ట వద్ద పెద్దపులి పాద ముద్ర

తాండూర్, ఫిబ్రవరి 10 : బెల్లంపల్లి రేంజ్ పరిధిలో దాదాపు 12 రోజుల పాటు సంచరించిన పెద్దపులి ఆదివారం రాత్రి మాదారం అడవుల్లోకి ప్రవేశించినట్లు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి తిరుపతి, బీట్ ఆఫీసర్ సీహెచ్ భాస్కర్ తెలిపారు. ఆదివారం బుగ్గ రాజరాజేశ్వరాలయం సమీపంలోని కొండపోచమ్మ గుడి పక్క నుంచి అంకుశం గుట్టల మీదుగా తాండూర్ మండలం మాదారం ప్రాంతంలోని గొంతెమ్మ గుట్టల ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు తెలియడంతో సోమవారం ఉదయం గొంతెమ్మ గుట్ట ప్రాంతంలో పెద్దపులి పాద ముద్రలు గుర్తించామన్నారు. తిరిగి సోమవారం సాయంత్రం తాండూర్ మండల సరిహద్దు దాటి రెబ్బెన మండలం పులికుంట అటవీ ప్రాంతంలో ప్రవేశించినట్లు పాద ముద్రలు గుర్తించినట్లు తెలిపారు. వేటగాళ్ల నుంచి పులిని రక్షించేందుకు యానిమల్ ట్రాకింగ్ టీంతో పర్యవేక్షిస్తున్నామన్నారు. మాదారం, పులికుంట సమీప గ్రామాల్లోని పశువుల కాపరులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

తక్కలపల్లిలో అవగాహన

రెబ్బెన, ఫిబ్రవరి 10: పులి సంచారంపై రెబ్బెన రేంజ్ అధికారి నిజాముద్దీన్, డిప్యూటీ రేంజ్ అధికారి భానేశ్ ఆదేశం మేరకు రెబ్బెన తక్కలపల్లి, పులికుంట, రోళ్లపహాడ్, రాజారం, కొత్తగూడతో పాటు పలు గ్రామాల్లో బీట్ అధికారులు ఉషారాణి, శ్రీలత అవగాహన కల్పించారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల సరిహద్దు వద్ద నిర్మించిన ఏకో బ్రిడ్జి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచినట్లు తెలిపారు. మాదారం వైపు నుంచి రెబ్బెన వైపు పులి వచ్చే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పులికి ఎలాంటి హాని కలిగించవద్దని సూచించారు.